
ఆ వేళ తన పుట్టినరోజు పండగ చేసుకుంటున్నంత సంతోషంగా ఉంది – నరకాసురుడికి! నిజానికారోజు తన పుట్టినరోజు కానే కాదు. ఆ మాటకొస్తే, ఎవరి పుట్టినరోజు పండగ వారికి ఆనందంగానే ఉంటుంది. అందులో ప్రత్యేకత లేదు. అందుకే ఆనాటి సంతోషం అంతకు వెయ్యింతలుగా ఉంది.... నరకుడికి!

నరకాసురుడు కృష్ణుడితో యుద్ధానికి పోతున్నాడు. ఈ దెబ్బతో తన గర్భశత్రువుని పరిమార్చి వేస్తాననే సంతోషం కన్నా గొప్ప విషయం మరొకటుంది.



# నరకుని కోరిక

పన్యాల రంగనాథ రావు

చాలా కాలానికి సత్యభామ మళ్ళీ తన కళ్ళఎదట పడబోతున్నది – తను మనసారా ప్రేమించిన సత్యభామ!

సత్యకోసం తను ఈసారి కృష్ణుణ్ణి చంపగలడు. ఆ సత్యకోసం తనే చస్తే అంతకన్నా ఈజీవితంలో గొప్ప ఆనందం ఇంకేముంటుంది?

కృష్ణుడు తను వొక్కడే కాకుండా సత్యభామను కూడా వెంటేసుకుని ఈ యుద్ధానికొస్తున్నట్టు, తనకు ఇదివరకే వేగుల వాళ్ళద్వారా తెలిసిపోయింది. అదీ తన అదృష్టమే. తనకు ఆడదాని చేతిలోనే చావు రాసిపెట్టి ఉన్నప్పుడు సత్యభామ చేతులమీదుగానే చచ్చేకన్నా గొప్పఅదృష్టం మరొకటి ఉండదు. ఇంతకూ తను ఈ యుద్ధానికి వెళ్తున్నది చావటానికికాదు, కృష్ణుణ్ణి చంపి సత్యను గెలుచుకోవటానికే. సత్యను పొందటానికి ఇంతకన్నా మరొక గొప్ప అవకాశం ఈ జన్మలో రాదు.

సత్యను తలుచుకుంటేనే నరకుడి వొళ్లు గగుర్పొడుస్తున్నది. మొట్టమొదటిసారి సత్యను — ఆ పిల్ల ఏకాంతంగా ఉన్న సమయంలో చూసినప్పుడుకూడా ఇట్లానే గగుర్పొడిచింది. ఆడపిల్లలో అంత అందముంటుందని, నరకుడు అదివరకెన్నడూ ఊహించలేక పోయినాడు.

స్త్రీలన్నా, స్త్రీ స్పర్శన్నా, తనకు కొత్తేంకాదు. అయితే ఇంతవరకూ ఏ ఆడదీ కూడా, తనలో ఇటువంటి చలనం కలిగించలేదు. అంతేకాక, సత్యను మొదటి సారి చూడగానే తనలో కలిగిన ఒక అనిర్వచనీయమైన భావం, ఒకానొక గౌరవ భావం, ఒకానొక పూజనీయమైన భావం, ఇదివరకెన్నడూ, ఏ ఆడదాన్ని చూసినా కలగలేదు. నిజమైన అందం, స్త్రీ అందం ఇంతగా తన గుండెను పట్టి లాగేస్తుందని నరకుడికి ఇంతవరకూ తెలీదు.

"ఇటువంటి గొప్ప అందగత్తెను పెళ్ళి చేసుకోని జన్మ ఏం జన్మ!" అనుకున్నాడు నరకుడు.

వెనకటికొకసారి అద్దంలో చూసుకున్నప్పుడు, తన అందానికీ, శీవికీ, రాజసానికీ, తనే మురిసిపోయి, తనకు సరితూగే అందమైన పిల్ల కనపడితేనే పెళ్ళి మాటతలపెడదా మనుకున్న నరకుడికి, సత్యభామను చూడగానే, ఇక తను పెళ్ళివిషయం ఆలోచించుకోవచ్చు ననుకున్నాడు.

సత్యభామ ఉన్నచోట, ఆమె చెలికత్తెలకుతప్ప ఇంకెవరికీ ప్రవేశంలేదు. మాయ రూపంలో తప్ప — నిజానికి, ఆ కృష్ణుడి రూపంలోతప్ప — ఇంకొక రూపంలో అక్కడికి వెళ్ళడం సాధ్యమయ్యే పనికాదు. తను ఎంతో అందగాడే అయినా, కృష్ణుణ్ణి తప్ప ఇతరుల్ని సత్య కన్నెత్తికూడా చూడకపోవచ్చు.

అందుకే, దగ్గర ఎవరూ లేకుండాచూసి, కృష్ణుడి రూపంలో నరకుడు, సత్యకు పది గజాల దూరంలో ప్రత్యక్షమయ్యాడు. అయితేతన పన్నాగం, సత్యదగ్గర ఎందుకూ కొరగాదని నరకుడికి వెంటనే స్ఫురించింది.

కృష్ణుడి రూపంలో ఉన్న నరకుణ్ణి చూడగానే సత్య నవ్వింది.

"కృష్ణుడి రూపంలోనే వొచ్చావే! తమాషా! నీ అసలురూపం నాకు కనిపిస్తూనే ఉంది! అందగాడివే! ఇంతకీ ఎవరు నువ్వు? ఎందుకొచ్చావు?" అన్నది సత్య.

నరకుడు ఒక్కసారి విస్తుపోయి తమాయించుకున్నాడు.

ఏమీ ఎరగనట్టే చిరునవ్వునవ్వి, "నా అసలురూపం చూడగలిగిన దానివి నేనెవరో పోల్చలేవా?" అన్నాడు నరకుడు.

"నువ్వు నిజమైన కృష్ణుడివి కావుగనక ఆ విషయం వెంటనే పోల్చుకున్నాను. మరి నిన్ను నేనిదివరకెన్నడూ చూసిన గుర్తు లేదు. చూస్తే పోల్చేదాన్నే! ఆ మాత్రం తెలీదా? చెప్పుఎవరు నువ్వు?" అన్నదిసత్య.

"నన్ను నరకుడంటారు — లోకమంతా అనుకునేటంత లోకకంటకుణ్ణి కానసీ, నిజానికి నేను లోకోద్ధరణకే అవతరించానని నీకు తరవాత తెలుస్తుంది. నీ అందానికి నేను ముగ్ధుణ్ణి అయినాను. నన్ను పెళ్ళాడమని కోరటానికి ఇట్లా వచ్చాను." అన్నాడు నరకుడు.

ఈ మాటలన్నీ సత్య పూర్తిగా విన్నదో లేదోగాని, ఆమె నోరు తెరుచుకుని చాలాసేపు అట్లానే చూస్తూ ఉండిపోయింది. ఆమెలో చలనం ఉన్నట్టు లేదు.

నరకుడు కొద్దిగా కంగారుపడి "సత్యా!" అన్నాడు.

ఆమెను సమీపిద్దామా—అని క్షణం ఆలోచించి, అది కూడనిపని అనుకుని దూరాన్నే నిలబడి ఉండిపోయినాడు. ఆమె మనసేమిటో స్పష్టంగా తెలుసుకోకుండా, సమీపించటం సభ్యతకాదు.

సత్య పలకలేదు.

"సత్యా!" అన్నాడు మళ్ళీ నరకుడు.

"ఆఁ" అన్నది సత్య.

"ఎందుకట్లా ఉన్నావు? వొంట్లో బాగా లేదా?"

అప్పటికిగాని సత్య పూర్తిగా తేరుకోలేక పోయింది.

నరకుడు! నరకాసురుడు! లోకకంటకుడు! రాక్షసుడు! ఈ రూపంలో తన ముందు ప్రత్యక్షమవటమా!

సత్య ఒకసారి తన పైటచెంగుతో కళ్ళు తుడుచుకొని నరకుడివేపు చూసింది.

"ఇంత సాహసానికెందు కొడిగట్టావు నరకా!" అన్నది.

"నే నింతవరకూచెప్పింది నీ కేమీవినపడలేదంటావా?" అన్నాడు నరకుడునవ్వుతూ.

"విన్నాను. కాని, నేను మనసారా ప్రేమించింది ఒక్క కృష్ణుణ్ణే — అని నీకు తెలీదా? తెలిసే ఈ పని చేశానంటావా? నీకు నిజంగానే నామీద ప్రేమవుంటే, మనసారా నన్ను ప్రేమిస్తున్నట్టయితే, తక్షణం ఇక్కడనుంచి వెళ్ళిపో! రాక్షస వంశానికి చెందిననీతో నాకపొత్తు ఎలా కుదురుతుందని భ్రమపడ్డావో అర్థంకాకుండా ఉంది!" అన్నది సత్యభామ.

"తెలుసు సత్యా! తెలుసు. నీప్రేమంతా కృష్ణుడిమీదనే ఉందని నాకు తెలీకకాదు. అయినప్పటికీ ప్రత్యక్షంగా నీకు కనపడి నా గొడవేదో చెప్పుకోవడం ధర్మంగా భావించబట్టే వొచ్చాను. నేను దొంగచాటు మనిషిని కాను, దొంగల్లేవచ్చి అడ పిల్లలను — వొంటరిగా ఉన్నవాళ్ళని ఎత్తుకుపోవటం కూడా నాయింటా వొంటాలేనిది, అటువంటి



పనులు బహుశా కృష్ణుడికే చాతనవు నను కుంటాను. చెప్పుతున్నా ననుకోకు."

సత్య నవ్వింది.

"నువు చెప్పుతున్నా ననుకోడంలేదు నేను. నీలో రసికత్వం బొత్తిగా లోపించి నందుకు నవ్వొస్తున్నది. ఆడపిల్ల మనసు బొత్తిగా తెలీనివాడివి. తెలిసివుంటే ఆమాట అని వుండేవాడివి కాదు."

"ఏమాట ?" అన్నాడు నరకుడు. చప్పున సత్య ఏమంటున్నదీ అర్థంకాక.

"తన ప్రియుడు తనను దొంగచాటుగా ఎత్తుకు పోవటమే, రసికత్వమంటే తెలిసే ఏ ఆడపిల్లయినా కోరుతుంది. ఆమాత్రం తెలీదా నీకు ?" అన్నది సత్య నవ్వుతూ.

"నిజమే – అందుకే, దొంగసొమ్మూ, దొంగముద్దూ ఉన్నంత తియ్యగా మరొకటి ఉండదంటారు !" అన్నాడు నరకుడు.

"అది తెలిసి ఉండికూడా అటువంటి పనికి ధైర్యంచాలక, పైగా కృష్ణుణ్ణి తప్పు పడుతున్నావా ? చాతకానిదానికి శౌర్యం లావుట. ఇంతకీ, ఇప్పుడంతా మించి పోయాక వచ్చి ఏం లాభం ? నామాటవిని, నువు వెళ్ళిపోవడం ఎందుకైనా మంచిది." అన్నది సత్య.

"సత్యా ! నన్నపార్థం చేసుకోకు. పొమ్మన్నావు గనక పోతున్నాను. ఇక్కడ నీకిష్టంలేని మరొక్క-క్షణం కూడా ఉండను. కాని, నా కున్నది ఒక్కటే కోరిక. ఆ కోరిక మన్నిస్తావనే అనుకుంటాను."

చేతులు రెండూ కట్టుకొని అతి దీనంగా ప్రాధేయపడుతున్న నరకుణ్ణి చూస్తే సత్యకు ఎక్కడలేని జాలి వేసింది. ఆ జాలిలోనే, ఎటువంటి తీర్చలేని కోరిక బయట పెడ తాడో అని భయమూ వేసింది.

"నా నియమాలకూ, మనో నిశ్చయానికీ భంగం వాటిల్లని కోరిక ఏదైనా సరే – కోరుకోవచ్చు." అన్నది.


"ఆ మాటన్నావు చాలు. అదే పది వేలు. పదికోట్లు, నీ తండ్రి దగ్గరున్న శమంతకమణి వంటి లక్ష మణులుకూడా ఆ మాటకు తీసిపోవు," అన్నాడు నరకుడు.

"శమంతకమణి సంగతికూడా నీకు తెలుసూ ?" అన్నది సత్య విస్తుపోయి.

"తెలీకేం ? నాకంతా తెలుసు," అన్నాడు నరకుడు.

"ఎల్లా ?"

"నా కోరిక తెలియచేయనివ్వు. ఆ తర్వాత చెప్తాను. చూడు సత్యా ? నాకు నిజంగా చావే రాసిపెట్టి ఉంటే, నేను నిజంగానే చనిపోవలసి వస్తే, ఆ చావేదో




నీ చేతులమీదుగా నాకు రానియ్యి. అంతకన్న నీదగ్గర్నుంచి నేను కోరుకునేదేదీ లేదు.''

నరకుడామాట అంటున్నప్పుడు, సత్యకు అప్రయత్నంగా రెండు కన్నీటి చుక్కలు రాలినై. అది గమనించి నరకుడు "చాలుసత్యా! చాలు! నాకోరిక విని, నాకోసం నువ్విప్పుడు రాల్చిన ఆ రెండు కన్నీటి చుక్కలే చాల్ను. ఆ రెండూ నాకెంత బలాన్నిస్తున్నా యనుకున్నావు?'' అన్నాడు.

సత్య కాసేపు మాట్లాడకుండా ముఖం పక్కకుతిప్పి ఆలోచనలో పడింది.

"నువ్వేదో ఆలోచనలో పడ్డావు. పోనీ. శమంతకమణి గురించి చెపుతా విను. నీ తండ్రిదగ్గర శమంతకమణి చూసి కృష్ణుడు_ సరదాకేఅనుకో _ తన కిమ్మన్నాడు _ నీ తండ్రి విరాకరించాడు _ బహుశా నీకదంతా తెలీదేమోలే! అది పోయిందని తప్ప. ఒక రోజున నీ పినతండ్రి దాన్ని మెళ్ళో వేసుకుని అడవికిపోయి సింహంనోట పడ్డాడు, జాంబవంతుడు ఆ సింహాన్ని పరిమార్చి, మణిని తీసుకుపోయి తన కూతురైన జాంబవతికి ఆడుకొనేటందు కిచ్చాడు. మణిని కృష్ణుడే దొంగతనం చేసాడని, నీ తండ్రి తూలనాడాడు. కృష్ణుడు ఆ నింద భరించలేక మణికోసం వెదకివెదకి జాంబవంతుడి దగ్గర ఉందని తెలుసుకొని, జాంబవంతుడితో యుద్ధంచేసి వోడించి, మణినీ, జాంబవతినీ కూడా గెల్చుకుని వచ్చాడు. అంటే, నీకు మరోసవతిని కూడా వెంటేసుకొచ్చాడన్న మాట! నాకన్నీ తెలుసు సత్యా!'' అన్నాడు నరకుడు, చివరిమాట కొంత కసిగా,

సత్య కూర్చున్నదల్లా ఒక్కసారి రివ్వున లేచింది. ''వొచ్చాడా! కృష్ణుడొచ్చాడా? ఎప్పుడు చూశావు?" అన్నది కంగారుగా.

''ఇప్పుడే వొచ్చాడు. మన మిక్కడ మాట్లాడుకుంటూండగా కృష్ణుడు, శమంతక మణిని నీ తండ్రికి వప్పగిస్తున్నాడులే _'' అన్నాడు నరకుడు నవ్వుతూ _ అంతలోనే "సత్యా'' అంటూ ఎవరో పిలిచినట్టయింది.

సత్యభామ తిరిగైనా చూడకుండా లేడిపిల్లలా చెంగు చెంగున లోనికి వెళ్ళింది. ఎంత అందమైని పరుగు! సత్యభామవంటి అందమైన ఆడపిల్ల పరుగులో ఉండే అందం కూడా, తనవంటివాడి మతి పోవటానికే కాక మరేమిటి?

సత్యభామ పరుగులో అందంతోపాటు కనపడ్డ అమాయకత్వానికి నరకుడు లోలోన నవ్వుకుని అక్కడనుంచి అదృశ్యమైనాడు.

అదృశ్యంకాక, ఆ క్షణంలో, తను అక్కడ చేయగలిగింది కూడా ఏదీ లేకపోవటం దురదృష్టం కాక మరేమిటి? ఎందుకంటే, ఆ క్షణంలోనే, కృష్ణుడికీ సత్యభామకీ పెళ్ళికూడా అయిపోయింది. తను ఏవిధంగానూ జోక్యం కలిగించుకోడానిక్కూడా అవకాశం లేకుండా పోయింది. సత్యవెళ్ళి, 'నేను నరకుణ్ణితప్ప ఇంకెవర్నీ పెళ్ళాడను, అనటానిక్కూడా లేకుండా పోయింది! తనపిచ్చిగాని, నిజంగాఆలోచిస్తే సత్య అట్లా ఎందుకంటుంది? ఉత్తర క్షణంలోనేపోయి, కృష్ణుడి కౌగిట్లోవాలిపోయింది.

తను మనసారా ప్రేమించిన సత్యతో కులుకుతున్న కృష్ణుణ్ణి చూడాలని నరకుడి ఉద్దేశంకాదు. కాని, సత్యనే మనసులో ముద్రవేసుకున్న నరకుడికి, ఇంకోభావం రావడంలేదు. సత్యను ఊహించుకున్నప్పుడల్లా, కృష్ణుడి వొడిలోనే ప్రత్యక్ష మవుతున్నది. నరకుడికి కృష్ణుడిపైన ఈర్ష్య అంత కంతకూ ఎక్కువ కాసాగింది. కృష్ణుణ్ణి పరిమారిస్తేనే తప్ప తనకు సత్య దక్కే అవకాశం ఎక్కడా లేదనిపించింది. కృష్ణుడు లేకుండా ఒక్క సత్యనే

వొంటరిగా ఊహించుకోటానికి ప్రయత్నమెక్కువవుతున్న కొద్దీ కృష్ణుడే సత్యకన్న ఎక్కువ కనిపిస్తున్నట్టయింది, నరకుడికి.

నాటినుంచీ నరకుడికి శాంతి లేకుండా చేసిన కృష్ణుణ్ణి పరిమార్చాలంటే కృష్ణుణ్ణి రెచ్చగొట్టే పనులు చేయటమొక్కటే మార్గం. అటువంటి పనులు ఇంతకుముందు తను ఏ ఉద్దేశంతో చేసినా, ఇక ముందు ఉద్దేశం ఒక్కటే.

నరకుడు క్రమేపీ సత్యనే ఊహించుకోగలగడంలో కృతకృత్యుడైనాడు. దేనికైనా మనసు ప్రధానం!

చాలాకాలానికి మళ్ళీ ఈ వేళ, ఇదంతా నరకుడి కళ్ళకు కట్టినట్టయింది. ఈ నాటికీ అతని కళ్ళలో మెదులుతున్నది లేడిపిల్లలాగా అందంగా పరుగెత్తిన సత్యభామే. నాటికి నేడు మళ్ళా సత్య దర్శనభాగ్యం లభించబోతున్నది. ఇంతకన్నా తనకేం కావాలి? ఈ ఆలోచనలతోనే నరకాసురుడు రథమెక్కి యుద్ధసన్నద్ధుడైనాడు.

ఎదురుగా యుద్ధభూమిలో అల్లంత దూరాన కృష్ణుడి రథం కనబడ్డది. పక్కనే సత్యభామ కూర్చున్నది. తనివితీరా సత్యను చూడగల అవకాశం ఇదొక్కటే తనకు. ఎవరో ఒకరు చావటం తప్ప ఈ యుద్ధం వల్ల కలిగేదేదీ లేదు. తనకు సంభవించినంతవరకూ – బాణాలు వేయడం కన్నా గద విసరడంకన్నా, సత్యను చూస్తూ కాలక్షేపం చేస్తే జీవితం ధన్యమవుతుంది.

బాణాలువచ్చిపడుతున్నై. కాని, సత్యనే దీక్షగా రెప్ప వేయకుండా చూస్తున్న నరకుడికవి తగలడంలేదు. ఎటువంటి బాణమొచ్చినా ఎదురుగా వస్తున్నట్టే వచ్చి పక్కకి తొలగిపోతున్నై – ధ్యానముద్రలో ఉన్నట్టుగా చూపులతోనే సత్యను ఆరాధిస్తున్న నరకుడిని కృష్ణుడి బాణాలేమీ చేయలేక పోయినై.

అంతలో కృష్ణుడు చతికిలపడి, సత్యభామ లేచినట్టయింది. ఆమె విల్లు పట్టుకుని సర్దుకోవటం కనబడ్డది – ఒక్కసారి సత్య తననే తదేకంగా చూస్తున్నట్టనిపించింది.

రెండు రథాలూ దగ్గిర పడినై.

"ప్రయోగించు సత్యా! దానికే ఇన్నాళ్ళయి ఎదురుచూస్తున్నాను. నా కోరిక చెల్లిస్తానన్నావు వెనక. జ్ఞాపకం ఉంది కదూ! సంధించు! సత్యా! సిద్ధంగా ఉన్నాను."

సత్య గురి చూసింది.

"కృష్ణుడంటే ఎటువంటి అభిప్రాయం గానీ లేని నాకు కృష్ణుడి బాణాలేంచెయ్యగలవు సత్యా! ఏం జరిగినా నీ బాణం ద్వారానే జరగాలి. నీ చేతులమీదుగానే ఈ నా గుండెలు చీలిపోవాలి. ఈ జీవితానికి నాకింతకన్నా గొప్పకోరిక లేదు సత్యా!"

నరకుడీ మాటలింకా అంటుండగానే, సత్య వేసిన బాణం వచ్చి అతని గుండెలో దూసుకుపోయింది. నరకుడు చెక్కుచెదరలేదు. నవ్వుతూనే రథం దిగాడు. సరాసరి సత్యభామ దగ్గరికి నడుచుకుంటూ ఠీవిగా వెళ్ళాడు. బాణం గుండెలో నిలిచేఉంది. రక్తంధారగా ప్రవహిస్తూనే ఉంది. నరకుడు సత్యను సమీపించి దగ్గరగా నిలబడ్డాడు.

"నీ పాదాలముందు నన్నుపడనీ సత్యా! నీ పాదాలముందు పడనీ!" అంటూ దభీమని మానల్లే పడిపోయినాడు. పక్కనే ఉన్న కృష్ణుడికి కనపడకుండా సత్యభామ రాల్చిన రెండు కన్నీటి చుక్కలు తన గుండెలపై పడడం, నరకుడు తన తుది ఘడియలో చూడగలిగాడు.

''ధన్యుణ్ణి సత్యా! ధన్యుణ్ణి!'' అన్న మాటలు నరకుని పెదవులదాకా వచ్చి ఆగిపోయినై. ★

